# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 269
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
జూలై 30, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



2లో..

## అంతా గోప్యం

- తలుపులు మూసి విధులు
- దామెర తహసీల్దార్ కార్యాలయంలో వింత పోకడ



## అమ్మ బాబోయ్.. 120 చలాన్లు..!

☐ ద్విచక్ర వాహనం స్వాధీనం

వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కాజీపేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ వెంకన్న తన సిబ్బందితో కలిసి బుధవారం కాజీపేట చౌరస్తాలో వాహన తనిఖీలు చేశారు. అదే సమయంలో అటుగా వచ్చిన వాహనదారుడి ద్విచక్రవాహనానికి సంబంధించిన వివరాలను పరిశీలించగా ఏకంగా 120 ట్రాఫిక్ చలాన్లు పెండింగ్ లో ఉన్నాయి. దీంతో ట్రాఫిక్ అధికారులు ఒక్క సారిగా ఖంగుతిన్నారు. ఈ చలాన్ల మొత్తం రూ.32,165 కావడంతో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. జరిమానా మొత్తం చెల్లిస్తేనే వాహనం రిలీజ్ చేయనున్నట్లు ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ వెంకన్న చెప్పారు.

– వరంగల్ వాయిస్, కాజీపేట


2లో..

## అవినీతిపై ఉక్కుపాదం

- అధిక ధరలకు యూరియా విక్రయిస్తే లైసెన్స్ రద్దు
- కలెక్టర్ రాహుల్ శర్మ
- ఆకస్మిక తనిఖీలతో హల్ చల్



8లో..

## కార్పొరేట్ వర్గాలకు మోడీ ఊడిగం

- కమ్యూనిజం ప్రపంచ వ్యాప్త సిద్ధాంతం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి
- వరంగల్ లో ద్వితీయ జిల్లా మహాసభలు ప్రారంభం




# డీసీసీ అధ్యక్షుడిగా.. దొమ్మాటి ?

- రేవంత్, వేం సూచనలతో ఫైనల్
- ఏఐసీసీకి చేరిన దస్త్రం
- ఒకటి, రెండు రోజుల్లో నియామకపు ఉత్తర్వులు
- పలువురు ఆశావహులకు నిరాశ

కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా దొమ్మాటి సాంబయ్య నియామకం ఖరారైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఏఐసీసీకి ప్రతిపాదనలు అందినట్లు ప్రచారం సాగుతోంది. డీసీసీ అధ్యక్ష పీఠం తమ వర్గ నాయకుడికి కట్టబెట్టాలని చాలా మంది ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేసినప్పటికీ అధిష్ఠానం దొమ్మాటి వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. గత పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ నుంచి పోటీకి దొమ్మాటి సాంబయ్య గ్రౌండ్ సిద్ధం చేసుకున్నారు. అయితే కడియం శ్రీహరి కూతుకు డాక్టర్ కడియం కావ్యకు టికెట్ కేటాయించడంతో నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవిని సాంబయ్యకు కట్టబెడితే తగిన న్యాయం జరుగుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తన ప్రధాన అనుచరుడికి అధ్యక్ష పదవి ఇప్పించుకునేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టినట్లు తెలిసింది. కొందరు తమ వారసులకు డీసీసీ పీఠం అప్పగించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అధ్యక్ష పదవికి అరడజను మందికిపైగా ఆశావహులు పోటీ పడినప్పటికీ రాష్ట్ర పార్టీ దొమ్మాటి సాంబయ్య పట్ల సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన వ్యక్తిగత సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ సూచనలతో అధిష్ఠానం దొమ్మాటి సాంబయ్య పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. - వరంగల్ వాయిస్, హనుమకొండ

# అవినీతిపై ఉక్కు పాదం

- అధిక ధరలకు యూరియా విక్రయిస్తే లైసెన్స్ రద్దు
- కలెక్టర్ రాహుల్ శర్మ
- ఆకస్మిక తనిఖీలతో హల్ చల్



**వరంగల్ వాయిస్, చిట్యాల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం చిట్యాల మండలంలోని సహకార సంఘ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఎరువుల దుకాణాలు, పశువుల ఆసుపత్రి, వడితల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుడిగాలి పర్యటన చేస్తూ అధికారులను, సిబ్బందిని ఉరుకులు, పరుగులు పెట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిట్యాల మండలంలో సహకార సంఘాల ద్వారా రైతులకు ఎరువులు విక్రయించే అవకాశం లేనందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి వ్యవసాయ శాఖ అధికారులు నివేదికలు అందచేయాలన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు పోలీస్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చిట్యాల మండలంలో యూరియా కొరత ఉన్న విషయాన్ని మంగళవారం జరిగిన సమావేశంలో ఎందుకు చెప్పలేక పోయారంటూ ఏఓపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కావాలంటే ఆర్గానిక్ ఎరువులు కొనాలని ఆంక్షలు పెడితే సహించొద్దన్నారు. వారిపై పోలీసు కేసులు నమోదు చేయాలన్నారు. అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తే సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.

### ఎరువుల దుకాణాల్లో తనిఖీలు..

ఓడీసీఎంఎస్, ఆగ్రోస్, గ్రోమోర్ ఎరువుల దుకాణాలను కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. ఎరువుల దుకాణదారులు నిబంధనలు పాటించాలని, స్టాకు రిజిస్టర్లు, స్టాకు వివరాల బోర్డులు, ధరల పట్టిక, కొనుగోలు చేసిన రైతుల వివరాలను రసీదు బుక్కుల్లో పరిశీలించారు. పట్టా లేని రైతులకు ఆధార్ ఆధారంగా అవసరం మేరకు యూరియా ఇవ్వాలని సూచించారు. ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులను దారి మళ్లించినా, బ్లాక్ చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుకు అవసరం మేర ఎంత ఎరువులు ఇస్తున్నారనే వివరాలు తప్పక నమోదు చేయాలన్నారు. రైతు సమస్యను ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్ ను ప్రతి దుకాణంలో డిస్ ప్లే చేయాలని ఆదేశించారు. టాస్క్ ఫోర్స్ అధికారులు నిరంతరం ఎరువులు, విత్తన దుకాణాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎరువులు ఎంత మేర పంటలకు వినియోగించాలో వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

### తహసీల్దార్ కార్యాలయంలో..

భూ భారతి దరఖాస్తుల ప్రగతిని సమీక్షించి, విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం రికార్డు గదిని పరిశీలించిన కలెక్టర్ భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యాలయంలో సీజ్ చేసిన ఇసుక నిల్వలను పరిశీలించిన ఆయన, వాటిని ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం ద్వారా విక్రయించాలని తహసీల్దార్ ను ఆదేశించారు. అధికారులు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే విధంగా కృషి చేయాలన్నారు. పశువుల ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల స్టాక్, వాక్సిన్ నిల్వలు, తదితర అంశాలను ఆయన పరిశీలించారు. పశువులకు అందించాల్సిన టీకాలు (వాక్సిన్లు) సమయానికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణతో పాటు రైతుల ఆర్థికాభివృద్ధి కూడా కొనసాగుతుందని పేర్కొన్నారు. అలాగే, అవసరమైన మందులు, టీకాలు అందుబాటులో ఉండేలా ముందస్తుగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను సూచించారు. అనంతరం ఒడితల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని స్టోర్, రక్త పరీక్ష గది, ఓపీ రిజిస్టర్ పరిశీలించారు. జ్వరాలు ప్రబలిన ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాల నిర్వహించాలన్నారు. ప్రతి రోజు ఎంత మంది వైద్య సేవల నిమిత్తం వస్తున్నారంటూ వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో సహకార అధికారి వాలియా నాయక్, పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ కుమార స్వామి, ఆర్డీఓ రవి, వ్యవసాయ శాఖ ఏడీఏ రమేష్, ఏవో శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ క్రాంతి కుమార్, తహసీల్దార్ ఇమామ్ బాబా తదితరులు పాల్గొన్నారు.



# అంతా గోప్యం

- తలుపులు మూసి విధులు
- దామెర తహసీల్దార్ కార్యాలయంలో వింత పోకడ

**వరంగల్ వాయిస్, దామెర :** దామెర తహసీల్దార్ కార్యాలయంలో గత రెండు రోజులుగా సిబ్బంది తలుపులు మూసుకొని విధులు నిర్వహించడం వివాదాలకు కారణమవుతోంది. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన సమయంలో కార్యాలయం తలుపులు మూసివేయడం ఏంటని నిలదీస్తున్నారు. వివిధ పనులపై కార్యాలయానికి వచ్చేవారిని లోనికి అనుమతించకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీంతో వారు గంటలకొద్ది వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే ఇటీవల నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ కార్యాలయానికి గొళ్లెం వేయాల్సినంత గోప్యత ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

# 31న స్పాట్ కౌన్సెలింగ్

- ప్రిన్సిపాల్ బి.నర్మదాబాయి



**వరంగల్ వాయిస్, ములుగు :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సొసైటీ గౌరవ కార్యదర్శి ఆదేశానుసారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లకు ఈ నెల 31న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.నర్మదాబాయి తెలిపారు. ములుగు జిల్లా పరిధిలో ములుగు (బాలికలు), జకారం (బాలురు), ఏటూరునాగారం మల్లంపల్లి (బాలురు) లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు మార్చి 2025లో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు మీరు ఎంపిక చేసుకున్న కళాశాలకు వెళ్లి మీ పేరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మెరిట్, రిజర్వేషన్ ప్రతిపాదికన సీట్లు భర్తీ చేయనున్నట్లు నర్మదాబాయి వెల్లడించారు.



# భూభారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్
- ఐనవోలు తహసీల్దార్ కార్యాలయం క్షేత్ర స్థాయి పరిశీలన

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భూభారతి దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా ఐనవోలు తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. భూభారతి దరఖాస్తుల ఆన్లైన్, భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. భూభారతి దరఖాస్తుల ఆన్లైన్, రిజిస్ట్రేషన్ల గురించిన వివరాలను తహసీల్దార్ విక్రమ్ కుమార్ ను అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పరిశీలించారు. పెండింగ్ లో ఉన్న వాటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఇతర అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. భూభారతి దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియను త్వరగా పూర్తిచేసి వాటిపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్, ఆర్ఐలు, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రులతో కుడా చైర్మన్ ఇనగాల భేటీ

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డిని బోరబండ, యూసుఫ్ గూడా డివిజన్లకు కో-ఆర్డినేటర్ గా నియమించారు. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్ జూబ్లీ హిల్స్ లోని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వర రావు నివాసంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఇంచార్జి మినిస్టర్ పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో పాటు రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జాంగా రాఘవ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డా.రియాజ్, రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# పోలీస్ డ్యూటీ మీట్ కు సర్వం సిద్ధం

**వరంగల్ వాయిస్, క్రైం :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మామునూర్ పీటీసీ వేదికగా గురువారం నుంచి మూడు రోజులపాటు నిర్వమించనున్న తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ -2025 సర్వం సిద్ధమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వెల్లడించారు. డ్యూటీ మీట్ ఏర్పాట్లపై బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణ ఇక్కడికి వచ్చిన అతిథులకు వసతి భోజన ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# పాలకుల విధానాలతో దివాలా తీస్తున్న రైతాంగం

- రైతుల వ్యవసాయ రక్షణకు ఉద్యమాలే శరణ్యం
- ఏఐకేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, వరంగల్:** ప్రభుత్వాల విధానాల వల్ల వాస్తవ సాగుదారులైన రైతులకు ఉత్పత్తి ఖర్చులు పెరిగి, పండిన పంటకు కనీస మద్దతు ధర లభించక అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వ్యవసాయాన్ని వీడి కూలీలుగా, కార్మికులుగా మారుతున్నారని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి అన్నారు. రైతుల వ్యవసాయ రక్షణకు బలమైన ఉద్యమాలే ఏకైక శరణ్యమని, ఈ దిశగా రాజకీయాలకు అతీతంగా రైతాంగాన్ని ఐక్యపరచాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్), హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు, మాజీ ఎమ్మెల్యే అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవాల సందర్భంగా 'రైతాంగ ఉద్యమాలు: ఓంకార్ గారి పాత్ర' అనే అంశంపై శాయంపేట మండలం రైతు వేదికలో జిల్లా సదస్సు సమావేశం జరిగింది. ఏఐకేఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వక్కల కిషన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి వల్లెపు ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా వల్లెపు ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ తన జీవితాన్ని తాడిత పీడిత ప్రజల విముక్తి కోసం త్యాగం చేశారని కొనియాడారు. "దున్నేవాడికే భూమి" అనే నినాదంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1 లక్ష 67 వేల ఎకరాల భూములను పేదలకు దక్కేలా కృషి చేశారని గుర్తు చేశారు. ఆదివాసి గిరిజనులకు 1/70 చట్టం, పెసా (పీఈఎస్ఏ) చట్టాలను, రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌ను తూచా తప్పకుండా అమలు చేయాలని, పోడు రైతులందరికీ హక్కులు కల్పించాలని, తునికాకుకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని అనేక నిర్బంధాలను తట్టుకొని భూస్వాములకు, పాలకులకు వ్యతిరేకంగా పోరాడి అనేక విజయాలు సాధించిన గొప్ప వ్యక్తి ఓంకార్ అని పేర్కొన్నారు. నర్సంపేట నుంచి శాసనసభ్యుడిగా ఐదు దఫాలుగా తిరుగులేని మెజారిటీతో ఎన్నికై, చట్టసభలను కష్టజీవుల సమస్యల పరిష్కారానికి ప్రశ్నించే గొంతుకగా, 'అసెంబ్లీ టైగర్'గా నిలిచాడని ప్రశంసించారు. ఆయన త్యాగాలు, ఆదర్శాల స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక చట్టాలను, విధానాలను నిరసిస్తూ, పండించిన పంటకు కనీస మద్దతు ధర చట్టాన్ని, పోడు భూములకు అటవీ హక్కులను సాధించుకునేందుకు, మార్కెట్ దోపిడీని నివారించేందుకు రాజకీయాలకు అతీతంగా రైతాంగాన్ని ఐక్యం చేసి పోరాటాలను ఉధృతం చేయాలని ఉపేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎన్.రెడ్డి హంసారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మహమ్మద్ ఉస్మాన్, పెద్దిరెడ్డి మహేందర్ రెడ్డి, యువజన సంఘం జిల్లా నాయకులు కర్ర రాజిరెడ్డి, నీల రవీందర్, విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, కర్ర మనోధర, సతీష్, రాజమౌళి, రవీందర్, రాజేశ్వరరావు, మల్లారెడ్డి, ప్రభాకర్ రావు, మంద భద్రయ్య, కూనూరు వెంకటేశ్వర్లు, రాజమౌళి, సునీలు, రాజేశ్వరి, శంకరు, బాబురావు, రాజన్న, సీతారామరెడ్డి, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ సాగుపై అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, వెంకటాపూర్:** పామాయిల్ పంట సాగుతో రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చని, ఈ విషయమై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. బుధవారం వెంకటాపూర్ మండలం జవహర్‌నగర్ వద్ద ఉన్న కె.ఎన్. బయోసైన్స్ ఆయిల్ ఫామ్ నర్సరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నర్సరీ విస్తీర్ణం, పెంచిన మొక్కల సంఖ్య, నాటుకోవడానికి సిద్ధంగా ఉన్న మొక్కలు, ఈ సంవత్సరానికి నాణ్యమైన మొక్కలు అందుబాటులో ఉన్నాయా వంటి వివరాలను జిల్లా ఉద్యాన అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరంలో రైతులకు నర్సరీలో ఒక సంవత్సరం వయస్సు గల మొక్కలను అందించగా, ప్రస్తుతం ఇంకా 1,17,000 మొక్కలు అందుబాటులో ఉన్నాయని జిల్లా ఉద్యాన అధికారి దండు సంజీవరావు వివరించారు. ఒక మొక్క 1.2 మీటర్ల ఎత్తులో, 12 ఆకులతో నాణ్యంగా ఉందని ఆయన తెలిపారు. రైతులకు అవగాహన కల్పించి ఎక్కువ ఎకరాల్లో పామాయిల్ నాటించాలని ఉద్యాన అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. నర్సరీ నిబంధనల మేరకు నాణ్యమైన మొక్కలను రైతులకు సకాలంలో అందించాలని, నర్సరీ నిర్వాహకులకు, నర్సరీ కంపెనీ వారికి కలెక్టర్ సూచించారు. అన్ని రికార్డులు సిద్ధంగా ఉంచాలని నర్సరీ ఇన్‌చార్జిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ ఇన్‌చార్జి, ఉద్యాన అధికారి జే. శ్రీకాంత్, నర్సరీ నిర్వాహకుడు కర్ణాకర్, ములుగు, వెంకటాపూర్ ఆయిల్ ఫామ్ కంపెనీ ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ నవీన్ నాయక్, జైన్ డ్రిప్ కంపెనీ ప్రతినిధి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల గుడిసెలు కూల్చివేత దుర్మార్గం

- ఎమ్మెల్యే, కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి
- ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్



**వరంగల్ వాయిస్, గీసుకొండ:** రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేదల గుడిసెలను తొలగించడం దుర్మార్గమైన చర్య అని, గుడిసెలను కూల్చివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం గీసుకొండ మండలం మొగిలిచర్ల శివారులోని పోగుల ఆగయ్య నగర్‌లో ప్రజాసంఘాల నాయకులు కూల్చివేసిన గుడిసెలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వంలో పేదల గుడిసెలను కూల్చివేయడం సిగ్గుచేటని పేర్కొంటూ, ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మాదాసి సురేష్ మాట్లాడుతూ, గత 16 సంవత్సరాలుగా పోగుల ఆగయ్య నగర్‌లో పేదలు గుడిసెలు వేసుకొని పక్కా గృహాలను నిర్మించుకున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో వారికి ఇంటి నంబర్లు కూడా కేటాయించారని, జీవో నెం. 58, 59 కింద పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారని గుర్తు చేశారు. అయినప్పటికీ, గుడిసె వాసుల పక్కన భూకబ్జాదారులైన కొందరు అధికార పార్టీ నాయకుల విలువైన భూములు ఉండటం వలన, వారికి మద్దతుగా అధికారులు ఎలాంటి నోటీసులు లేకుండానే గుడిసెలను కూల్చివేశారని ఆరోపించారు. ఈ చర్యల వల్ల గుడిసె వాసులు నిత్యవసర వస్తువులు, ఇతర సామాగ్రి, పెద్ద మొత్తంలో నగదును కూడా కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారద, ఇతర ఉన్నత అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. భూకబ్జాదారులతో పాటు వారికి అండగా నిలుస్తున్న అధికారులను సస్పెండ్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గుడిసె వాసులకు మద్దతుగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు కలకోటి మహేందర్, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే, ప్రజాసంఘాల నాయకులు పోత గోల్కొండ బుచ్చన్న, మాదాసి సుదర్శన్, మాజీ సర్పంచ్ దొంగల రమేష్, గుడిసె వాసులు గాజు కళమ్మ, గనిపాక రేణుక, గనిపాక రజిత, కోమల, సరిత, సరోజన, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా సోషల్ మీడియా ఇంచార్జిగా రాంపెల్లి లింగమూర్తి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. కుల అభివృద్ధి, సోషల్ మీడియాలో కులబాంధవుల క్రియాశీలక భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో, జిల్లా కేడర్‌లో ఉత్సాహాన్ని నింపేందుకు నూతనంగా సోషల్ మీడియా ఇంచార్జిని నియమించింది. ఈ మేరకు అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు ఆడెపు రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్ పర్యవేక్షణలో రాంపెల్లి లింగమూర్తిని వరంగల్ జిల్లా సోషల్ మీడియా ఇంచార్జిగా నియమిస్తూ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకంపై కులబంధువులు, కుల నేతలు రాంపెల్లి లింగమూర్తికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# ఘనంగా గ్రామ దేవతలకు పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం:** కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం, కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శ్రావణమాసం బుధవారం పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి నెలా నిర్వహించే పూజా కార్యక్రమాల్లో భాగంగా, గ్రామ దేవతలకు పంచామృతాలతో అభిషేకం చేసి, పట్టు వస్త్రాలతో అలంకరించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోటగుళ్లు పరిరక్షణ కమిటీ గౌరవ అధ్యక్షులు మామిండ్ల మల్లికార్జున్ గౌడ్, ఆలయ నిర్వాహకులు నాగపురి శ్రీనివాస్ గౌడ్, సభ్యులు రౌతు కిషోర్, రాజు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ స్పాట్ అడ్మిషన్లు

## రేపు బాలికల కళాశాలలో స్వీకరణ




**వరంగల్ వాయిస్, పరకాల :** 2025-2026 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి స్పాట్ అడ్మిషన్లు రేపు గురువారం నిర్వహించనున్నట్లు పరకాల (మల్లక్కపేట)లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. కృష్ణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జోన్ 4కు చెందిన పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈ స్పాట్ అడ్మిషన్లకు అర్హులు. కళాశాలలో బైపీసీ, ఎంపీసీ గ్రూపులలో కొన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. దరఖాస్తులు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు స్వీకరించబడతాయి. పదవ తరగతిలో 400 మార్కులకు పైగా సాధించిన విద్యార్థినులు అర్హులు. దరఖాస్తు చేసేటప్పుడు అసలు ధృవపత్రాలు (ఒరిజినల్ సర్టిఫికెట్లు), వాటికి సంబంధించిన మూడు సెట్ల జిరాక్స్ కాపీలు, మరియు మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకురావాలని ప్రిన్సిపాల్ సూచించారు. ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత, అదే రోజు సాయంత్రం 4 గంటలకు ఎంపికైన విద్యార్థినుల జాబితాను కళాశాల నోటీసు బోర్డులో ప్రదర్శిస్తామని ప్రిన్సిపాల్ కృష్ణకుమారి వివరించారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, జూలై 30, 2025

# విద్యావ్యవస్థ నిర్వీర్యం బీఆర్ఎస్ ఘనతే

● కాంగ్రెస్ నాయకుల విమర్శ



**వరంగల్ వాయిస్, గణపురం:** విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. భూపాలపల్లి మాజీ శాసనసభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి–జ్యోతి దంపతులు నిన్న పాఠశాలల్లో విస్తృతంగా పర్యటించి, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేయడాన్ని విడ్డూరంగా అభివర్ణించారు. గడిచిన పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నప్పుడు పాఠశాలలపై వారికి ప్రేమ ఎందుకు గుర్తుకు రాలేదని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. ఆ పదేళ్లలో మండల కేంద్రంలో కనీసం ఒక ఎంఈఓను కూడా నియమించలేదని, పిల్లలకు కాస్మోటిక్ ఛార్జీలు, మెస్ ఛార్జీలు ఇవ్వలేదని ఆరోపించారు. పాఠ్య పుస్తకాలు, ఏక రూప దుస్తులు కూడా అందించలేదని, విద్యార్థులు తినే భోజనం గురించి ఒక్కసారీ కూడా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. "ఈరోజు మా నాయకుడు, భూపాలపల్లి శాసనసభ్యులు సత్యనారాయణ రావు అభివృద్ధిని చూసి ఓర్వలేక, ఏ అంశాలపై మాట్లాడాలో తెలియక పాఠశాలల చుట్టూ తిరుగుతూ మొసలి కన్నీరు కారుస్తున్నారు" అని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా విమర్శించారు. గండ్ర దంపతులు శాసనసభ్యులుగా ఉన్నప్పుడు తాము నిర్మించిన పాఠశాలలను ఎప్పుడైనా తనిఖీ చేశారా అని ప్రశ్నించారు. కనీసం పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఎప్పుడైనా భర్తీ చేశారా అని నిలదీశారు. హాస్టల్స్‌లో స్కావెంజర్స్ పోస్టులను నియమించాలని కూడా తెలియకుండా మాట్లాడుతున్నారా అని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థను ప్రగతిపథంలో నడిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారని, విద్యావ్యవస్థలో ఉన్న ఖాళీలను భర్తీ చేస్తూ విద్యార్థులను ఉన్నత స్థాయిలకు ఎదిగేలా చేయాలనే దృఢ సంకల్పంతో తమ నాయకుడు కృషి చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, కో–ఆప్షన్ సభ్యులు ఎండీ చోటేమియా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్కూరు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణ, వైస్ ఎంపీపీ విడుదలై అశోక్, మాజీ సర్పంచ్ నారగని దేవేందర్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి కృష్ణ, మండల అధికార ప్రతినిధి మామిళ్ల మల్లికార్జున గౌడ్, వార్డు మెంబర్ గంధం ఓధాకర్, సీనియర్ నాయకులు బాల్య కుమార్, పూదరి రవి, ఎస్కే జానీ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వ భరోసా కల్పించాలి



**వరంగల్ వాయిస్, చిట్యాల:** కాంగ్రెస్ ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులను చిన్నచూపు చూస్తోందని విశ్వబ్రాహ్మణ చిట్యాల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పోతుగంటి చంద్రమౌళి ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, కులవృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న విశ్వబ్రాహ్మణులు సొంత ఇళ్లు నిర్మించుకోలేక అద్దె ఇళ్లలో నివసిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులను పట్టించుకోలేదని చంద్రమౌళి విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు విశ్వబ్రాహ్మణులకు అందడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన విశ్వబ్రాహ్మణులకు ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు శ్రీనివాసాచారి, రామ్ బ్రహ్మం చారి, మురళి, ఆనందాచారి బ్రహ్మం, పోతుగంటి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## అవయవ దానంపై సమీక్ష




**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలంగాణ జీవన్‌దాన్ సంస్థ పిలుపు మేరకు, నేత్ర, శరీర అవయవ దానం చేసే పలు సంస్థలతో డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్ అధ్యక్షతన నిన్న ఒక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జీవన్‌దాన్‌లో తీసుకొచ్చిన మార్పులను, కొత్త అంశాలను అసెంబ్లీ ద్వారా చట్టబద్ధం చేసినట్లు నరేంద్ర కుమార్ తెలిపారు. జీవన్‌దాన్‌కు సహకారం అందిస్తున్న అన్ని సంస్థలను ఆయన ప్రశంసించారు. వివిధ సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాలలో జరుగుతున్న అవయవ దాన పనితీరును సమావేశంలో వివరించారు. తెలంగాణ నేత్ర అవయవదాతల అసోసియేషన్ (టీఈఓబీడీఏ) ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించగా, నరేంద్ర కుమార్ వాటిని పూర్తిగా విని ప్రశంసించారు. టీఈఓబీడీఏ తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం.పద్మ, వరంగల్ అధ్యక్షులు కే.మల్లారెడ్డి, కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షురాలు విజయ కుమారి, ముఖ్య సలహాదారు పి.అశోక్ బాబు, పలు సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ బోనాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** శ్రావణ మాసంలో గ్రామ దేవతలైన పోచమ్మ తల్లి బోనాల పండుగను అంగరంగ వైభవంగా, సంతోషదాయకంగా నిర్వహించుకోవడం ఆనవాయితీ అని మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బుధవారం 54వ డివిజన్‌లోని పోచమ్మకుంటలో కుమ్మరి సంఘం వారు నిర్వహించిన బోనాల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ, గ్రామ దేవతల చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖశాంతులతో, సుభిక్షంగా ఉండాలని, తెలంగాణలో ఆనవాయితీగా బోనాల కార్యక్రమాలను నిర్వహించుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సోదా కిరణ్, సంకు నర్సింగ్, మాజీ కార్పొరేటర్ కుసుమ లక్ష్మీనారాయణ, సంఘం నాయకులు కందికొండ వేణుగోపాల్, పైడిపాల అశోక్, శ్రీను, జనార్ధన్, సదానందం, నాయకులు కేశోజు ప్రణయ్, శ్రీధర్, నరేందర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలో వైద్యానికి పెద్ద పీట



**వరంగల్ వాయిస్, హుజురాబాద్:** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితల ప్రణవ్ అన్నారు. ఇప్పటికే ఎస్‌డిఎఫ్ ఫండ్ ద్వారా హుజూరాబాద్, జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రులకు చెరో రూ. 15 లక్షల చొప్పున మొత్తం రూ. 30 లక్షలు కేటాయించి, పనులు పూర్తి చేశామని ఆయన వెల్లడించారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, శానిటేషన్, మెయింటెనెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఇటీవల కాలంలో 100 డెలివరీలు జరిగాయని తెలిపారు. రోగులకు మరింత భరోసా ఇచ్చేలా సేవలు అందించాలని డాక్టర్లను కోరారు. ఆసుపత్రి అభివృద్ధికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి మరిన్ని నిధులు తీసుకొస్తామని ప్రణవ్ హామీ ఇచ్చారు. గతంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, డాక్టర్ల కొరత లేకుండా చూసుకుంటామని, దీనిపై కలెక్టర్, డీఎంహెచ్‌ఓలతో మాట్లాడినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ నారాయణ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మెడికల్ క్యాంపును పరిశీలించిన డీఎంహెచ్‌ఓ అప్పయ్య



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే పెద్దాపూర్ పాఠశాలలో జరుగుతున్న ఆర్.బి.ఎస్.కె (రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం) మెడికల్ క్యాంపును జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ. అప్పయ్య ఆకస్మికంగా పరిశీలించారు. పరకాల టీమ్–బీ వైద్య బృందం ఈ నెల 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు ఈ క్యాంపును నిర్వహిస్తోంది. మెడికల్ క్యాంపులో డాక్టర్ అప్పయ్య ఓపీలో పాల్గొని, ఆర్.బీ.ఎస్.కే బృందం నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు దోమలు, ఈగల వలన వచ్చే సీజనల్ వ్యాధులైన జలుబు, దగ్గు, జ్వరం, వాంతులు, డయేరియా, డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల వంటి ఇన్ఫెక్షన్లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలను తెలియజేశారు. అనంతరం వంటశాలను, స్కూల్ పరిసరాలను, భోజన మెనూను కూడా ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దామెర అనిత, ఏటీపీ చంద్రకళ, డీడబ్ల్యూ కవిత రాణి, హెచ్‌ఎస్ ఆస్మా, ఆర్.బి.ఎస్.కె వైద్య బృందం డాక్టర్ రవీందర్, డాక్టర్ సంధ్యారాణి, మెడికల్ ఆఫీసర్స్ బోస్, ఫార్మసిస్ట్, ఏఎన్‌ఎం కవిత, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

# 31 నుంచి టీపీసీసీ ఆధ్వర్యంలో 'పాదయాత్ర - శ్రమదానం'



**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఈ నెల 31 నుంచి ఆగస్టు 6 వరకు రాష్ట్రవ్యాప్తంగా 'పాదయాత్ర – శ్రమదానం – కార్యకర్తల సమావేశం' వంటి కార్యక్రమాలను నిర్వహించనుంది. ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఎమ్మెల్సీ సంయుక్తంగా ఈ కార్యక్రమాలకు నాయకత్వం వహించనున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణపై టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈవి శ్రీనివాస్‌లతో ఏఐసీసీ ఇంచార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథన్ విస్తృతంగా చర్చించారు. . రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌ను సిద్ధం చేసేందుకు ఈ కార్యక్రమాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని టీపీసీసీ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని పాదయాత్ర, శ్రమదానం, కాంగ్రెస్ కార్యకర్తల సమావేశ కార్యక్రమాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాదయాత్రలో పాల్గొని పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా ఇంచార్జులు కృషి చేయాలని పీసీసీ అధ్యక్షులు, ఏఐసీసీ ఇంచార్జులు కలిసి నిర్ణయించినట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఈవీ శ్రీనివాస్ తెలిపారు.

# రైతు వ్యతిరేక విధానాలను ప్రతిఘటించండి

## ◆ ఏఐకేఎంఎస్ నాయకుల పిలుపు



**వరంగల్ వాయిస్, నర్సంపేట:** కేంద్రంలోని బీజేపీ కూటమి మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి రైతాంగానికి పిలుపునిచ్చారు. బుధవారం నర్సంపేట న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గ సమావేశం అధ్యక్షులు జక్కుల తిరుపతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి మాట్లాడుతూ గతంలో మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ నల్ల చట్టాలను దేశ రైతాంగం పోరాడి రద్దు చేయించిందని గుర్తు చేశారు. అయితే, మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తిరిగి అవే నల్ల చట్టాలను నూతన జాతీయ వ్యవసాయ మార్కెట్ చట్టం ద్వారా ప్రవేశపెట్టబోతోందని ఆయన ఆరోపించారు. ఈ చట్టం కార్యరూపం దాలిస్తే దేశ రైతాంగ పరిస్థితి మళ్లీ అధోగతి పాలవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వ ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆగస్టు 13న జరిగే ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారని తెలిపారు. నానో యూరియా తదితర అనవసర మందులను రైతులకు అంటగడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. కొంతమంది ఫర్టిలైజర్ షాపుల యజమానులు ఇప్పటికీ యూరియాను బ్లాక్ చేస్తున్నారని, అధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని మైదాన ఫారెస్ట్ ప్రాంతాల్లో రైతులు సబ్సిడీ ద్వారా ఆయిల్ ఫామ్, జామ, జామాయిల్ పండ్ల తోటలు పెంచడానికి వారికి రావాల్సిన సబ్సిడీలను వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు భోగి సారంగపాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మెడ సాంబయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు ఐలయ్య, అబ్బుర బోయిన ఎల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ‘సీఎంకు దమ్ముంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి’

## మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ సవాల్



**వరంగల్ వాయిస్, డోర్నకల్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నిజంగా దమ్ముంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ సవాల్ విసిరారు. డోర్నకల్ మండల కేంద్రంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాతే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు రావాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయకుండానే మళ్లీ ఎన్నికలకు సిద్ధమవుతోందని రెడ్యా నాయక్ విమర్శించారు. హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రజల ముందు ఏ ముఖం పెట్టుకొని వస్తుందని ఆయన ప్రశ్నించారు. చట్టంపై అవగాహన లేని పోలీసులు తమపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలోని 25 మంది బీఆర్ఎస్ నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేశారని, తనపై కూడా కేసు పెట్టడం ప్రజలు సహించడం లేదని అన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలిచి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో విద్యాసాగర్, భిక్షం రెడ్డి, తుమ్మ వెంకట్ రెడ్డి, పాండు నాయక్, బోసు వెంకన్న, రాయల వెంకటేశ్వర్లు, నంద్యాల మధు, కాడెం బాబు, మోహన్ నాయక్, తేజావాత్ సంధ్య రమేష్, అరుణ, జనార్ధన్, గౌస్, చంటి, యశోదర్, కొత్త వీరన్న తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా మహాసభను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా 2వ మహాసభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బొట్ల చక్రపాణి పిలుపునిచ్చారు. హనుమకొండ నగరంలోని అలంకార్ జంక్షన్ వద్ద ఉన్న టీఎన్జీఎస్ భవన్‌లో జరిగే ఈ మహాసభల్లో జిల్లాలోని గ్రామపంచాయతీ కార్మికులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. బుధవారం సుందరయ్య భవన్‌లో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు పల్లె రామన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చక్రపాణి మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు నష్టదాయకమైన, పని భారాన్ని పెంచి బానిసలుగా మార్చే మల్టీ పర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేటగిరీలను యథావిధిగా కొనసాగించాలని, కనీస వేతనం రూ.26,000 నిర్ణయించి అమలు చేయాలని, రెండవ పీఆర్సీ పరిధిలోకి వేతనాలు తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. కారోబార్, బిల్లు కలెక్టర్లు స్పెషల్ స్టేటస్ వంటి అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు, అలాగే నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్మికుల సమస్యల సాధన కోసం రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి గబ్బెట యాకయ్య, జిల్లా నాయకులు బండా సాంబయ్య, భోగం రమేష్, ఈసంపల్లి ఐలయ్య, గాదే కుమారస్వామి పాల్గొన్నారు.

# మడేలయ్య జాతరకు ఏర్పాట్లు చేయిస్తా

## ● కార్పొరేటర్ మరుపల్ల రవి హామీ



**వరంగల్ వాయిస్, వరంగల్:** శ్రావణ మాసంలో జరగనున్న మడేలయ్య జాతరకు భక్తుల సౌకర్యార్థం మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేయిస్తానని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. బుధవారం ఉర్సు కరీమాబాద్ ప్రాంతంలోని రజకులు ఉర్సు రంగసముద్రం వద్ద గల మడేలయ్య దేవాలయం వద్ద గ్రౌండ్‌ను చదును చేసి మొరం పోయాలని, దేవాలయానికి రంగులు వేయాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరుతూ కార్పొరేటర్ మరుపల్ల రవికి వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రం అందుకున్న అనంతరం కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ మడేలయ్య దేవాలయం వద్ద ఉన్న ఎగుడుదిగుడు ప్రదేశాన్ని సమాంతరం చేయించడానికి మేయర్ గుండు సుధారాణి, అధికారుల దృష్టికి తీసుకువస్తానని తెలిపారు. దేవాలయానికి మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రంగులు వేయిస్తానని రజక సంఘం నాయకులకు హామీ ఇచ్చారు. ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో రజక సంఘం నాయకులు రాముల బాబు, రాముల సదానందం, రాముల మల్లేశం, కొండమీది యాదగిరి, కొండమీద మురళి, కొత్తకొండ శంకర్, రాముల యాదగిరి, రాముల కృష్ణ, రాముల సాంబమూర్తి, నెల్లుట్ల రమేష్, నెల్లుట్ల సాంబమూర్తి, కొత్తకొండ చింటూ, బసవరాజ్ రాజు, బసవరాజ్ బిక్షపతి, బసవరాజు రమేష్, రాముల శ్రీనివాసులు ఉన్నారు.

# వైన్ షాపులు, బార్‌లు సమయపాలన పాటించాలి

## హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైన్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ల యజమానులతో బుధవారం స్టేషన్‌లో సీఐ మచ్చ శివకుమార్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, బార్ అండ్ రెస్టారెంట్, వైన్ షాపుల యజమానులు తమకు అనుమతి ఉన్న సమయాల్లోనే దుకాణాలు తెరవాలని స్పష్టం చేశారు. సమయపాలన పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అదేవిధంగా, వైన్ షాపులు, బార్‌ల ముందు ఎవరూ బహిరంగంగా మద్యం సేవించకుండా చూడాలని, వాహనాలు సరైన క్రమంలో నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. దుకాణాల్లోని సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చూసుకోవాలని, తప్పనిసరిగా రెండు కెమెరాలు రోడ్డు వైపు ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని ఆయన ఆదేశించారు. భద్రతాపరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ మచ్చ శివకుమార్ నొక్కి చెప్పారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేలు

## కాజీపేట దర్గా ఉత్సవాలకు ఆహ్వానం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఈరోజు తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కే.ఆర్. నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాజీపేట దర్గా పీఠాధిపతి కుసూర్ పాషాతో కలిసి ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కాజీపేట ఉర్సు (సయ్యద్ షా అఫ్జల్ బియాబాని దర్గా) ఉత్సవాలకు ఆహ్వానించారు.

# లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రవీందర్ గౌడ్

## నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**వరంగల్, వాయిస్ ఆత్మకూరు:** లయన్స్ క్లబ్ ఆఫ్ దేశాయ్ ఆత్మకూర్ ఐదవ ఇన్స్టాలేషన్ కార్యక్రమం సోమవారం హనుమకొండలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గం అధికారికంగా బాధ్యతలు స్వీకరించింది. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన ఏరుకొండ రవీందర్ గౌడ్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే, నాగబండి శివప్రసాద్ ప్రధాన కార్యదర్శిగా, బాదం వెంకటేశ్వర్లు కోశాధికారిగా నియమితులయ్యారు. సమాజ సేవ పట్ల రవీందర్ గౌడ్కున్న అంకితభావం, నిరంతర కృషి ఆయన్ను ప్రజల్లో విశ్వసనీయ నాయకుడిగా నిలబెట్టాయి. ఆయన అధ్యక్ష పదవికి ఎంపికవడం పట్ల ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేశారు. నిరాడంబరంగా సేవా కార్యక్రమాలను ముందుండి నడిపించడంలో ఆయనకు మంచి పేరుంది. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ ఎన్. సుధాకర్ రెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ పి. హరికృష్ణ రెడ్డి, జోన్ చైర్ పర్సన్ లయన్ సోమయ్య, చార్టెడ్ ప్రెసిడెంట్ ఊరుకొండ రాజేందర్, టింగిలికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, నడికూడ:** భూ సమస్యల పరిష్కారం కోసం "భూ భారతి" పథకం కింద స్వీకరించిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ కె. వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం నడికూడ తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, వివిధ మాడ్యూల్స్‌కు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాణి, డీ.టీ. సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# డీసీసీ అధ్యక్ష పదవికి పింగిలి నరసింహారెడ్డి దరఖాస్తు



**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి:** హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామానికి చెందిన పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌ను హైదరాబాద్‌లో కలిసి వర్ధన్నపేట శాసనసభ్యుడు కె.ఆర్. నాగరాజుతో పాటు తన బయోడేటాను సమర్పించారు. మీనాక్షి నటరాజన్ సానుకూలంగా స్పందించి, తన దరఖాస్తును పరిశీలిస్తానని హామీ ఇచ్చినట్లు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి తెలిపారు.

# ప్రణవ్ పరామర్శలు, అభినందనలు



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ జమ్మికుంట పట్టణంలో పర్యటించి, పలువురు కాంగ్రెస్ నాయకులను పరామర్శించారు. జమ్మికుంట పట్టణంలోని 5వ వార్డు తాజా, మాజీ కౌన్సిలర్లు పిట్టల శ్వేత–రమేష్ దంపతులకు ఆడబిడ్డ పుట్టగా ఆసుపత్రిలో వారిని కలిసి వొడితల ప్రణవ్ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా, 11వ వార్డు తాజా, మాజీ కౌన్సిలర్ బిట్ల కళావతి భర్త, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోహన్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రణవ్ ఆసుపత్రికి వెళ్లి మోహన్‌ను పరామర్శించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించాలని అక్కడి డాక్టర్లకు సూచించారు.

# వరి నారుమడులు, పత్తి పంటల పరిశీలన



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని పులుకుర్తి, పసరగొండ గ్రామాల్లోని వరి నారుమడులు, పత్తి పంటలను వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) రామకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు నారుమడి యాజమాన్యం, పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణపై విలువైన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో రైతులు అంకేశ్వరపు రాంబాబు, ముంద్రాతి బిక్షపతి, మోరే రాజు, కాశెట్టి లక్ష్మణ్, గోపు రమేష్, శనిగీరం బిక్షపతి, మంద మహేందర్, ఆకుల తిరుపతి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**వరంగల్ వాయిస్, గీసుగొండ:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య. శారద ఆదేశించారు. బుధవారం వరంగల్ జిల్లా, గీసుగొండ మండలం, వంచనగిరి గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. కలెక్టర్ క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను నేరుగా కలిసి, వారి నిర్మాణాలను పరిశీలించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందిస్తోందని తెలిపారు. గ్రావెల్, ఇసుక, సిమెంట్, ఐరన్‌లను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఇందిరమ్మ లబ్ధిదారులు కొనుగోలు చేయాలని, మేస్త్రీలకు అధిక ధరలు చెల్లించవద్దని, ప్రభుత్వం నిర్దేశించిన ధరలను మాత్రమే వారికి ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అలాగే, 500 ఎస్ఎఫ్టీ (చదరపు అడుగులు) వరకు మాత్రమే నిర్మాణం చేపట్టాలని ఆమె సూచించారు. అనంతరం అదే గ్రామంలో పశుసంవర్ధక శాఖ ద్వారా గొర్రెలు, మేకలకు వేస్తున్న బ్లూ టంగ్ (నీలి నాలుక) టీకాలను కలెక్టర్ పరిశీలించారు. గొర్రెలలో బ్లూ టంగ్ వ్యాధి నివారణకు టీకాలు వేయడం తప్పనిసరి అని ఆమె అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మండలాల వారీగా టీకాలు వేసేందుకు ప్రణాళిక రూపొందించామని తెలిపారు. ఈ నెల జూలై 29 నుంచి ఆగస్టు 8 వరకు జిల్లావ్యాప్తంగా 1.58 లక్షల గొర్రెలు, మేకలకు బ్లూ టంగ్ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. వ్యాధి ప్రబలకుండా ముందస్తుగా ఈ టీకాలను వేయించుకోవాలని గొర్రెల పెంపకదారులకు కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని, ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక అధికారి బాలకృష్ణ, పశు వైద్య అధికారి శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## కలెక్టర్‌ను కలిసిన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ ..

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన వరంగల్ ఆర్‌డీఓ సత్యపాల్ రెడ్డి బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య. శారదను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

# డ్రైన్ జంక్షన్లపై వెంటనే మెష్‌లను ఏర్పాటు చేయాలి



**మేయర్ గుండు సుధారాణి**

**వరంగల్ వాయిస్, వరంగల్:** గ్రేటర్ వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి మురుగు కాలువల జంక్షన్లపై తక్షణమే మెష్‌లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆమె అధికారులతో కలిసి వరంగల్ పట్టణంలోని పలు మురుగు కాలువ జంక్షన్లను, మురుగునీరు నిలిచే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బట్టల బజార్, కృష్ణ కాలనీ, పోచమ్మ మైదాన్, కాశీబుగ్గ, డీ–మార్ట్ ముందు, చార్‌బోలి, ఎల్లమ్మ టెంపుల్ దగ్గర ఉన్న మురుగు కాలువ జంక్షన్లను, నీరు నిలిచే ప్రాంతాలను మేయర్ పరిశీలించి, వాటిని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. మేయర్ మాట్లాడుతూ, వరంగల్ నగరంలో దాదాపు 100 మురుగు కాలువ జంక్షన్లు ఉన్నాయని తెలిపారు. వాటిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి మెష్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, డ్రైన్ల ద్వారా వరద నీరు సాఫీగా వెళ్లేలా ప్రతిరోజూ శుభ్రం చేయాలని సూచించారు. ఐసీసీసీ (ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్)కు మ్యాపింగ్ చేసి, క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అన్నారు. మురుగు కాలువలపై కల్వర్టులు లేని చోట తక్షణమే నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్‌తో పాటు సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఈఈ శ్రీనివాస్, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, డీఈలు, ఏఈలు, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల శుభ్రతతో వ్యాధులకు దూరం

**◆ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య**

**వరంగల్ వాయిస్, పరకాల:** వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. బుధవారం ఆయన పరకాల మండలంలోని నాగారం గ్రామం, ఆరోగ్య ఉపకేంద్రం, ప్రాథమిక పాఠశాల, అలాగే పరకాల ప్రాంతీయ వైద్యశాలలను ఆకస్మికంగా సందర్శించి పలు సూచనలు చేశారు. నాగారం ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్ఓ, చిన్నారులకు, గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యాక్సిన్లను పరిశీలించారు. ప్రతి బుధవారం, శనివారం వ్యాక్సినేషన్ అందుబాటులో ఉంటుందని, ప్రభుత్వ వ్యాక్సిన్లు నాణ్యత కలిగి ఉంటాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలని లబ్ధిదారులతో అన్నారు. ఉపకేంద్రం రికార్డులను, నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (NCD) రిజిస్టర్, డయాబెటిస్, అధిక రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులకు మందులు వాడుతున్న వారి జాబితాలను ఆయన పరిశీలించారు. అనంతరం నాగారం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఆర్‌బీఎస్‌కే (రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం) సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పరకాల ప్రాంతీయ వైద్యశాలను సందర్శించి అక్కడి ఎన్‌సీడీ క్లినిక్‌ను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఐసీటీసీ సెంటర్ (సమగ్ర కౌన్సెలింగ్, పరీక్షా కేంద్రం), బ్లడ్ బ్యాంక్‌ను కూడా సందర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. సీహెచ్‌సీ పరకాలలోని బర్త్ ప్లాన్ ట్యాగ్డ్ ఫెసిలిటీ రిజిస్టర్‌ను పరిశీలించిన ఆయన, అర్హులైన ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల కోసం రావాలని సూచించారు.



అనంతరం పీపీ యూనిట్, అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, వర్షాకాలం కావడంతో గ్రామాల్లో నీరు నిలిచిపోయి దోమలు పెరిగే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. "ప్రతి ఒక్కరూ తమ ఇంటిని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా ఇంటి ఆవరణలో నీరు నిలిచే కుండీలను వారానికి రెండుసార్లు శుభ్రం చేసి నీటిని పట్టుకోవాలి. ఇంటి చుట్టూ ఉన్న చెట్ల పొదలను తొలగించుకోవాలి" అని సూచించారు. జ్వరం, అతిసారం వంటి వ్యాధులు వస్తే వెంటనే స్థానిక ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలను సంప్రదించాలని, వారు ప్రాథమిక చికిత్స అందించి అవసరమైతే పీహెచ్‌సీకి లేదా పరకాల ఏరియా హాస్పిటల్‌కు పంపి చికిత్స అందిస్తారని తెలిపారు. అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ సేవలను తప్పకుండా వినియోగించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ప్రశాంతి, సునీత (ఏఎన్ఎం), వెంకటలక్ష్మి (ఏఎన్ఎం), హెల్త్ అసిస్టెంట్‌లు శ్రీధర్, వేణుగోపాల్, విద్యాసాగర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# విజయ్ దేవరకొండతో ఇంకోసారి..



టాలీవుడ్ స్టార్ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నా మరోసారి కలిసి నటించబోతున్నట్లు– తెలుస్తుంది. ఇప్పటికే వీరిద్దరి కాంబోలో వచ్చిన గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ వచ్చి మంచి విజయాలు అందుకున్నాయి. దీంతో ఈ హిట్ జోడి మళ్లీ తెరపై రోమాన్స్ చేయబోతున్నట్లు– వార్తలు వస్తున్నాయి. టాక్సీవాలా, శ్యామ్ సింగరాయ్ చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు రాహుల్ సాంకృత్యాయన్ విజయ్ దేవరకొండతో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. టాక్సీవాలా తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో మంచి అంచనాలు ఉన్నాయి. వీడీ 14గా రాబోతున్న ఈ ప్రాజెక్టను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ నిర్మిస్తుండగా.. హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో రాయలసీమ నేపథ్యంలో ఈ చిత్రం రాబోతుంది. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే షూటింగ్ ప్రారంభించనుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాలో కథానాయికకు సంబంధించి ఒక వార్త వైరల్‌గా మారింది. ఈ మూవీలో కథానాయికగా మేకర్స్ రష్మిక మందన్నాని అనుకుంటున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే ఫ్యాన్స్‌కి పండగనే చెప్పుకోవాలి. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## నేడు విజయ్ దేవరకొండ కింగ్‌డమ్ ..

విజయ్ దేవరకొండకు చాలా రోజుల తర్వాత మంచి ఛాన్స్ దొరికింది. పైగా ఈ సారి తన వెనక మంచి బ్యాక్ గ్రౌండ్ సపోర్ట్ దొరికింది. విజయ్ కెరీర్ లోనే భారీ బడ్జెట్ తో తీసిన మూవీ కింగ్ డమ్. జులై 31న రిలీజ్ కాబోతోంది. ఎలాంటి పోటీ– ఉండొద్దని రెండు సార్లు వాయిదా వేస్తూ వచ్చారు. వారం కిందట భారీ అంచనాలతో హరిహర వీరమల్లు.. ఇప్పుడు చల్లబడ్డాడు. వీరమల్లుపై మిక్స్ డ్ టాక్ ఉండటంతో ఆ మూవీకి ఆదరణ తగ్గుతోంది. పైగా పదిహేను రోజుల దాకా పెద్ద సినిమాలు లేవు. కింగ్ డమ్ మీద ట్రైలర్ తో భారీగా అంచనాలు పెరిగాయి. టికెట్ రేట్లు– కూడా కొంత వరకు ఏపీలో పెంచారు. కాబట్టి రేట్ల విషయంలో పెద్దగా నెగెటివిటీ– లేదు. సితార సంస్థకు బలమైన బ్యాక్ గ్రౌండ్ ఉంది. అనిరుధ్ వల్ల తమిళ్ లో మార్కెట్ ఏర్పడిరది. పైగా గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్ వల్ల మూవీపై పాజిటివ్ వైబ్స్ పెరిగాయి. ఇలా అన్ని రకాలుగా కింగ్ డమ్ కు మంచి వాతావరణం ఏర్పడిరది. ఏ మాత్రం హిట్ టాక్ వచ్చినా వసూళ్లు భారీగా పెరుగుతాయి. అందులో నో డౌట్. పైగా గురువారం రిలీజ్ అవుతోంది కాబట్టి లాంగ్ వీకెండ్ దొరికింది. ప్రస్తుతం థియేటర్లలో వీరమల్లు, మహావతార్ ఆడుతున్నాయి. వీరమల్లు జోరు తగ్గింది. మహావతార్ ఉన్నా మాస్ ఆడియెన్స్ కింగ్ డమ్ వైపే చూస్తున్నారు. కాబట్టి కొంచెం హిట్ టాక్ తెచ్చుకున్నా విజయ్ కెరీర్ కు ఇది బూస్ట్ అవుతుంది.

# లాంగ్ గ్యాప్ తరవాత

సమంత లాంగ్ గ్యాప్ తర్వాత మరో తెలుగు సినిమా చేసేందుకు రెడీ అయింది. గత కొంత కాలంగా బాలీవుడ్ మోజులో టాలీవుడ్ ను పూర్తిగా పక్కన పెట్టేసింది. ఇటీవల నిర్మాతగా మరో అవతారం ఎత్తి తొలి ప్రయత్నంగా అందరు కొత్త నటీనటులతో ' శుభం' అనే చిన్న సినిమాను నిర్మించింది. థియేటర్స్ లో అంతగా మెప్పించని ఈ సినిమా ఓటీటీలో కాస్త సందడి చేసింది. సినిమా నిర్మాణంలో తొలి పెట్టుబడి పెట్టిన సమంతకు ఓటీటీ రూపంలో బాగానే గిట్టు–బాటు– అయింది. మంచి లాభాలు చూసింది. కానీ శుభం కు ముందు సమంత నిర్మాణంలో ఓ సినిమా స్టార్ట్ చేసింది. ఆ సినిమాలో తానె స్వయంగా నటిస్తూ నిర్మిస్తోంది. ఈ చిత్రానికి బేబీ, అలా మొదలైంది చిత్రాల దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వం వహించనుంది. గతంలో వీరిద్దరి కాంబోలో 2019లో వచ్చిన ఓ బేబీ సూపర్ హిట్ గా నిలిచింది. గతేడాది సమంత బర్త్ డే సందర్భంగా ' మా ఇంటి బంగారం' అనే సినిమా అనౌన్స్ చేసారు. కానీ వివిధ కారణాల వలన ఈ సినిమాను చాలా కాలంగా పక్కన పెట్టేసింది సమంత. అయితే చాలా కాలంగా ఆగిన ఈ సినిమా తిరిగి షూటింగ్ స్టార్ట్ చేసుకోనుంది. ఈ ఏడాది సెప్టెంబరు లో షూట్ స్టార్ట్ చేయబోతున్నారు. షూటింగ్ త్వరగా ఫినిష్ చేసి వచ్చే ఏడాది సమ్మర్ లో రిలీజ్ చేసేందుకు ఎ□`లాన్ చేస్తున్నారు.





## హిందీ చిత్రాల గురించి పెద్దగా తెలియదు: మురుగదాస్

వైవిధ్యమైన కథలను ప్రేక్షకుల ముందుకుతీసుకురావడంలో ముందుంటారు దర్శకుడు మురుగదాస్. ప్రస్తుతం శివకార్తికేయన్ ప్రధాన పాత్రలో 'మదరాసి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. హిందీ సినిమాల విషయంలో తనకు ఏమీ తెలియదని అన్నారు. ఈ విషయంలో తాను దివ్యాంగుడనని ఒప్పుకున్నారు. మురుగదాస్ దర్శకత్వంలో సల్మాన్‌ఖాన్ హీరోగా ఇటీవల వచ్చిన 'సికందర్' ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన స్పందించారు. భాష విషయంలో తాను కొంత గందరగోళానికి గురైనట్లు– తెలిపారు. కానీ, తెరకెక్కించే సమయానికి డైలాగుల విషయంలో గందరగోళం ఏర్పడుతుంది. అందుకే హిందీ చిత్రాలకు వర్క్ చేసే సమయంలో నేను దివ్యాంగుడిని అవుతానని మురుగదాస్ వివరించారు.

## ఉస్తాద్, ఓజిలను పూర్తి చేసే పనిలో..

టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ ప్రస్తుతం బ్యాక్ టు– బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. పొలిటికల్ కమిట్‌మెంట్స్ కారణంగా ఆలస్యమవుతూ వచ్చిన సినిమాలు ఒక్కోటిగా పూర్తి చేసే పనిలో ఉన్నాడు. ఇప్పటికే విడుదలైన హరిహరవీరమల్లు పార్ట్ 1 బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ప్రస్తుతం ఉస్తాద్‌భగత్ సింగ్, ఓజీ సినిమాలను కూడా పూర్తి చేయడంపైనే తన ఫోకస్ అంతా పెట్టాడు. అయితే కెరీర్‌లో తొలిసారి పవన్ కల్యాణ్ ప్రమోషన్స్‌లో పాల్గొన్నాడని తెలిసిందే. నిర్మాత ఏఎం రత్నం విజ్ఞప్తి మేరకు పవన్ కల్యాణ్ హరిహరవీరమల్లు కోసం ప్రమోషనల్ ఈవెంట్స్‌కు ఎక్కువ సమయం కేటాయించాడు. కాగా సుజీత్ డైరెక్షన్‌లో నటస్తున్న ఓజీ కోసం కూడా ఇదే రూట్‌ను ఎంచుకోబోతున్నాడట. ఓజీపై బజ్‌ను మరింత పెంచేలా ఇంటర్వ్యూల్లో పాల్గొనాలని ప్లాన్ చేస్తున్నట్టు– ఫిలింనగర్ సర్కిల్‌లో ఓ వార్త రౌండప్ చేస్తోంది. మరి ఇదే నిజమైతే సినిమా గురించి ఎలాంటి విషయాలు ప్రేక్షకులు, అభిమానులతో షేర్ చేసుకుంటాడనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో ప్రియాంకా అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, ప్రకాశ్ రాజ్, శామ్, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డీవీవీ ఎంటర్–టైన్‌మెంట్స్‌పై డీవీ దానయ్య నిర్మిస్తున్నారు. ఓజీకి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓజీ ఈ ఏడాది సెప్టెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.



వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, జూలై 30, 2025



# అమ్మవారిపేటలో తొలి పూజలు

- సమ్మక్క, సారక్కకు చీర, సారె సమర్పణ
- పాల్గొన్న జాతర కమిటీ

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** అమ్మవారిపేటలోని సమ్మక్క, సారక్కలకు శ్రావణమాసం బుధవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లులిద్దరికీ చీర, సారె సమర్పించారు. పూజారులు పెద్ద ఒడ్డె బౌరిశెట్టి శ్యాంసుందర్, జంపయ్య, సంజీవ, రాము, సమ్మయ్య, మల్లేశం, రాములు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి పిల్లలు, పెద్దలు ఆయురారోగ్యాలు, అష్ఠ ఐశ్వర్యాలు కలిగి ఉండాలని ఆకాంక్షించారు. శ్రావణమాసం తల్లులకు అతి పవిత్రమైన మాసం అన్నారు. ఈ సందర్భంగా జాతర చైర్మన్ కోడూరి భిక్షపతి మొక్కులు చెల్లించుకున్నారు. జనవరి 28, 2026 నుంచి జనవరి 31, 2026 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న జాతరకు భారీ ఏర్పాట్లు చేయనున్నట్లు ప్రకటించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. జాతర ఆర్గనైజర్ దాసి రాందేవ్ మాట్లాడుతూ ఏటేటా అమ్మవారి పేట జాతరకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోందన్నారు. స్థానిక ఎమ్మెల్యే నాగరాజు, మంత్రి కొండా సురేఖల సహాయ సహకారాలతో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

# కార్పొరేట్ వర్గాలకు మోడీ ఊడిగం

- కమ్యూనిజం ప్రపంచ వ్యాప్త సిద్ధాంతం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి
- వరంగల్ లో ద్వితీయ జిల్లా మహాసభలు ప్రారంభం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కార్పొరేట్ వర్గాలకు కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ ఊడిగం చేస్తూ పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి ఆరోపించారు. వరంగల్ జిల్లా సీపీఐ ద్వితీయ మహాసభలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక అబ్బాస్ ఫంక్షన్ హాల్ లో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి అధ్యక్షత జరిగిన సమావేశంలో చాడ వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మోడీ పాలనలో అంబేద్కర్ అందించిన రాజ్యాంగాన్ని అమలు చేయకుండా ప్రజాస్వామ్యం గొంతునొక్కుతూ ప్రజల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. గత 11 ఏళ్లుగా ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో ముందుకు సాగుతున్నారని విమర్శించారు. ప్రశ్నించే ప్రజల గొంతు నొక్కుతూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయ్యారని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు రెడ్ కార్పెట్ పరుస్తూ లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టిన వారు బీజేపీతో అంటగాగుకున్నారని విమర్శించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలను తుంగలో తొక్కుతూ రచయితలను, కవులను, కళాకారులను, విద్యావేత్తలను అణిచివేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను మంటగలుపుతున్నారన్నారు. నిరుద్యోగం, ఆకలి, దారిద్రం నిరంతరం పెరుగుతూ పేదలకు విద్య, వైద్యం అందని ద్రాక్షలా మారుతోందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం ఆదివాసీలను హత్య చేస్తున్నదని, కమ్యూనిస్టులను అంతం చేయాలని కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. మావోయిస్టులపై చేపట్టిన మారణకాండను నిలిపివేయాలని సీపీఐ మొదటి నుంచి పోరాడుతుందన్నారు. కమ్యూనిస్టులను అంతం చేయలేరని, కమ్యూనిజం ప్రపంచ వ్యాప్త సిద్ధాంతం అన్నారు.

### నగరంలో భారీ ప్రద్రర్శన..

సీపీఐ జిల్లా ద్వితీయ మహాసభల సందర్భంగా వరంగల్ నగరంలో బుధవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. శివనగర్ లోని సీపీఐ కార్యాలయం తమ్మెర భవన్ నుంచి ప్రారంభమైన ర్యాలీ వరంగల్ చౌరస్తా మీదుగా పోచమ్మ మైదాన్ వరకూ సాగింది. అనంతరం జరిగిన సభలో సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర నాయకులు టి.వెంకట్రాములు, సిరబోయిన కరుణాకర్, పంజాల రమేష్, సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రి, పల్లె నర్సింహా, జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్ కే బాష్ మియా, పనాస ప్రసాద్, నాయకులు గన్నారపు రమేష్, దండు లక్ష్మణ్, అక్కపెల్లి రమేష్, బుస్సా రవీందర్, తోట చంద్రకళ, సంగి ఎలేందర్, గుండె బద్రి, ఆరెల్లి రవి, కె.చెన్నకేశవులు, జి.మునీశ్వర్, దామెర క్రిష్ణ, వి.శంకరయ్య, ఎండి.ఖాసీం, కుమారస్వామి, రాజు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.




# కేయూలో ఎన్సీసీ క్యాంప్

## 758 మంది కేడెట్స్ కు శిక్షణ

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలంగాణ బెటాలియన్, వరంగల్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పది రోజుల కంబైండ్ అన్యూవల్ ట్రైనింగ్ క్యాంప్ – 6 (సీఏటీసీ–6), ఎయిర్ ఫోర్స్ ఇంటర్ గ్రూప్ క్యాంప్ (ఐజీసీ) శిక్షణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ క్యాంప్‌ను కల్నల్ ఎస్ఎస్.రామదుర్రై నేతృత్వంలో నిర్వహిస్తున్నారు. మొత్తం 758 మంది కేడెట్స్ ఈ శిక్షణలో పాల్గొంటున్నారు. శిక్షణ క్యాంపు బుధవారం ఏడో రోజు వరంగల్ గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ అన్నారావ్ నేమ్బర్కర్, 'వీర్ చక్ర' శిక్షణా పద్ధతులను, ఫైరింగ్, డ్రిల్, కల్చరల్ ప్రోగ్రాములు, బెస్ట్ కేడెట్ ఎంపిక, ఫ్లాగ్ ఏరియాలను పరిశీలించారు. అనంతరం ఆయన శిక్షణ ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. రిపబ్లిక్ డే క్యాంప్, ఎయిర్ ఫోర్స్ ఇంటర్ గ్రూప్ క్యాంప్ కోసం అభ్యర్థిత్వం పొందిన కేడెట్స్‌కు ఆయన విలువైన సూచనలు, మెలకువలు అందించారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్.రామదుర్రై అందిస్తున్న శిక్షణ పద్ధతులను ఆయన అభినందించారు. కేడెట్స్ ప్రదర్శించిన నైపుణ్యాలను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా 'సెక్షన్ డ్రిల్ డెమో' నిర్వహించారు. ఇందులో ప్రొఫెసర్ మల్లారెడ్డి, హాస్టల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజ్ కుమార్, కంప్యూటర్ సైన్సు విభాగ అధిపతి డాక్టర్ బి.రమా, డాక్టర్ బి.మంజుల, డాక్టర్ సలోని పతిమా తదితర యూనివర్సిటీ అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ గ్రూప్ ట్రైనింగ్ అధికారులు, ఖమ్మం, వరంగల్ జిల్లాల కమాండింగ్ అధికారులు పాల్గొన్నారు. ముఖ్యంగా లెఫ్టినెంట్ కల్నల్ రవి సునారే, కెప్టెన్ డాక్టర్ పి.సతీష్, కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, సుబేదార్ మేజర్ జై రామ్ సింగ్, సౌరస్య, అజిత్ కదం, సందీప్, క్వార్టర్ మాస్టర్ సుతారి, సందీప్ పవార్, లెఫ్టినెంట్ గణేష్, రాధాకృష్ణ, దినేష్, సంతోష్, నిఖిలేష్, జీవన్, భవాని, సంధ్య, కళ్యాణి, సూపరింటెండెంట్ అరుణ, కుమారస్వామి, దత్తు, సతీష్, మహేష్, నిక్లేష్ పాల్గొన్నారు.






# జోగులాంబకు మహర్ధశ

- రూ. 382.50 కోట్లతో ఆలయం సమగ్రాభివృద్ధి
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- మాస్టర్ ప్లాన్ పై ఉన్నతాధికారులతో సమీక్ష



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** అలంపూర్ జోగులాంబ టెంపుల్‌ను సమగ్రంగా అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో జోగులాంబ ఆలయ మాస్టర్ ప్లాన్ పై ఎండోమెంటు ఉన్నతాధికారులతో మంత్రి సురేఖ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ వెంకటరావు, తెలంగాణ ధార్మిక్ అడ్వైజర్ గోవింద హరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... జోగులాంబ ఆలయాల అభివృద్ధి విషయంలో తమ ప్రభుత్వం రాజీ పడదని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు. కృష్ణ – తుంగభద్ర నదుల సంగమ ప్రాంతంలో జోగులాంబ శక్తి పీఠం ఉందని, ఈ టెంపుల్ ప్రగతికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో భక్తులు, సందర్శకులు, పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చినప్పటికీ ఆ మేరకు నిర్మాణ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. టెంపుల్‌ను అభివృద్ధికి రూ.382.50 కోట్ల కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. మూడు విడతల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నట్లు సురేఖ తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com